సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 22 । జూలై । 2025



సీజనల్ వ్యాధులతో జాగ్రత్త!
సీజనల్ వ్యాధులు దరిచేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.
- 8లో ▸



నిర్మించారు.. నిర్వహణ..
మూగజీవాల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో గ్రామాలలో నిర్మించిన పశువుల నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /23.8

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఖర్గేకు శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ



కామారెడ్డి టౌన్ : అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఖర్గేను సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో షబ్బీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

సీఎంను కలిసిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్



కామారెడ్డి టౌన్: సీఎం రేవంత్‌రెడ్డిని కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె సీఎంకు బొకే అందజేసి సన్మానించారు. పార్టీ వ్యవహారాలు, పరిస్థితులను సీఎంకు వివరించానని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించారని ఇందుప్రియ తెలిపారు.

'లీగల్ సర్వీసెస్' కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ : లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వహణ కరపత్రాలను బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ హైదరాబాద్, కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నారని, కుటుంబ తగాదాలను పరిష్కరిస్తుందని అన్నారు. ఉచిత న్యాయ సేవల కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ వలంటీర్లు రామకృష్ణారెడ్డి, పుష్పలత, నాగులగామ సాయిబాబా, హైమద్, అయ్యాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటి మట్టం



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, ప్రాజెక్ట్ నుంచి ఔట్‌ఫ్లో సమానంగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 608 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 277 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1068.60(21.02 టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు



గేటు కష్టాలు పట్టని నేతలు!

- రోజూ 60 నుంచి 70 రైళ్ల రాకపోకలు
- రైలొచ్చినప్పుడల్లా కనీసం పది నిమిషాలు ఆగాల్సిందే
- క్రాసింగ్ ఉన్నప్పుడు 20 నిమిషాలు తప్పని పరిస్థితి
- గేటు ఎత్తగానే ట్రాఫిక్‌కు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న కామారెడ్డి పట్టణ ప్రజలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణాన్ని రెండుగా చీల్చే రైల్వే లైన్‌ను దాటాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. మూడు నాలుగు జిల్లాలకు కూడలిగా కామారెడ్డి పట్టణం ఉండగా.. రైల్వే పట్టాల దిగువ ఉన్న ప్రాంతాన్ని పాత పట్టణంగా, పై భాగాన ఉన్న ప్రాంతాన్ని కొత్త పట్టణంగా పిలుస్తారు. జిల్లాగా ఏర్పడకముందే కామారెడ్డి పట్టణం నలువైపులా విస్తరించగా, ఆ తరువాత పరిధి మరింత వేగంగా పెరిగింది. కాగా కొత్త, పాత పట్టణాల మధ్య రైల్వే లైన్‌పై ఇరుకైన వంతెన ఒక్కటే ఉండడంతో ప్రత్యామ్నాయంగా అశోక్‌నగర్‌లోని రైల్వేగేటు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వేలైన్ మీటర్ గేజ్‌గా ఉన్న కాలంలో రైళ్లు తక్కువ సంఖ్యలో నడిచేవి. దీంతో పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. బ్రాడ్‌గేజ్‌గా మారిన తరువాత రైళ్ల సంఖ్య భారీగా పెరిగింది. ఓ రకంగా ఉత్తర భారతం, దక్షిణ భారతం మధ్యన ఈ రైలుమార్గం అనుసంధానంగా ఉంది. ప్రయాణికులకు సంబంధించి రైళ్లు ప్రతిరోజూ దాదాపు 50 నుంచి 55 వరకు, అలాగే గూడ్స్ రైళ్లు దాదాపు 20 వరకు తిరుగుతాయి. ఒకసారి గేటు పడితే కనీసం 10 నిమిషాలు, క్రాసింగ్ ఉంటే 20 నిమిషాలపాటు వేచి ఉండాల్సిందే. ఫలితంగా రైల్వే గేటు మీదుగా వెళ్లే వాహనదారులు చికాకు పడుతున్నారు. గేటు ఎత్తగానే ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైల్వే గేటు మీదుగా వేలాది మంది రాకపోకలు సాగిస్తారు. గేటు దాటి అడ్లూర్ రోడ్డు, రామారెడ్డి రోడ్ల గుండా దాదాపు ఇరవైకి పైగా గ్రామాలకు వెళ్లేవారంతా గేటు గుండా వెళ్తారు. నిరంతరం వాహనాల రాకపోకలు సాగుతాయి.

కలెక్టరేట్‌కు వెళ్లేందుకు అవస్థలు

జిల్లా కలెక్టరేట్, పోలీసు కార్యాలయాలు బైపాస్ రోడ్డు సమీపంలో నిర్మించగా, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ప్రజలు రైల్వే గేటు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. పాత బస్టాండ్ నుంచి వచ్చే వారికి మాత్రమే రైల్వేగేటుతో అవసరం ఉండదు. సగానికి పైగా పట్టణం రైల్వే గేటుకు పడమరన ఉంటుంది. కొత్త బస్టాండ్, విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీ, కాకతీయనగర్, శ్రీరాంనగర్, అశోక్‌నగర్, శ్రీనివాసనగర్, స్నేహపురి కాలనీ తదితర ప్రాంతాల నుంచి అశోక్‌నగర్ రైల్వే గేటు దాటి కలెక్టరేట్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఉద్యోగులు, అధికారులు చాలా మంది కొత్త పట్టణంలోనే నివాసం ఉంటారు. గేటును తప్పించుకుని రైల్వే నిజాంసాగర్ చౌరస్తా, రైల్వే బ్రిడ్జి, పాతబస్టాండ్ మీదుగా వెళ్లాలంటే అనేక కష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. రైల్వే బ్రిడ్జి ఇరుకైనది కావడంతో ట్రాఫిక్ ఎప్పుడు స్తంభిస్తుందో తెలియని పరిస్థితి ఉంది. పాత బస్టాండ్ నుంచి దర్శన్ టాకీస్, పంచముఖి హనుమాన్ ఆలయం గుండా వెళ్లాలంటే ఇరుకైన రోడ్డు కావడంతో అక్కడా ఇబ్బందులు తప్పవు. పైగా అదనంగా మూడు కిలోమీటర్లు తిరగాల్సి ఉంటుంది. దానికితోడు పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా, రైల్వే కమాన్, పోలీస్‌స్టేషన్, ఇందిరాచౌక్ దగ్గర ట్రాఫిక్‌ను దాటాల్సి ఉంటుంది. దీంతో దగ్గరి తోవతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని ప్రతి ఒక్కరూ రైల్వేగేటు మీదుగానే వెళ్తారు. దగ్గరి తోవ, ఇంధనం ఆదా ఏమోకానీ గేటు వేసిన సమయంలో నిరీక్షించాల్సిన పరిస్థితులు ఇబ్బంది పెడుతున్నాయి.

క్రాసింగ్ ఉంటే నరకమే..

రెండు రూట్లలో రైళ్లు వెళ్లే సమయం ఒక్కసారే ఉందంటే చాలు వాహనదారులకు చుక్కలు కనిపిస్తాయి. దాదాపు 20 నిమిషాల నుంచి అరగంట పాటు వాహనాలు ఆగాల్సి వస్తోంది. నిజామాబాద్ వైపు నుంచి రైలు వచ్చే ముందు గేటు వేస్తారు. ఆ రైలు స్టేషన్‌కు చేరుకున్న తరువాత, సికింద్రాబాద్ నుంచి వచ్చే రైలుకు లైన్ క్లియర్ చేస్తారు. ఆ రైలు గేటు దాటి వెళ్లేందుకు కనీసం పది నిమిషాలు పడుతోంది. దీంతో అరగంట సమయం వృథా అవుతోంది. అరగంటలో వందలాది వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. క్రాసింగ్ ఉందంటే చాలు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అదే సమయంలో వర్షం కురిస్తే ఎటూ వెళ్లలేక, వర్షంలో నానుతూ ఉండాల్సి వస్తోంది. గేటు పడినప్పుడల్లా కనీసం పదిహేను నిమిషాల నుంచి 20 నిమిషాల పాటు గేటు వద్ద ఆగాల్సిన పరిస్థితుల్లో ట్రాఫిక్ జామ్ అవుతోంది. లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, స్కూల్ బస్సులు వచ్చినపుడు పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఒక్కోసారి వాహనాలు ఢీకొని గొడవలకు కారణమవుతున్నాయి.

ఎవరికీ పట్టని ప్రజల గోడు

జిల్లా కేంద్రంలో రైల్వే గేటు వద్ద నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు పట్టడం లేదు. పట్టణంలో రైల్వే గేటు కష్టాలు తీర్చేందుకు అండర్‌పాస్‌లు, వంతెన నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏడాదికేడాది ట్రాఫిక్ పెరుగుతోంది. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. ఏళ్లుగా ప్రజలు పడుతున్న కష్టాలను కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. చాలా చోట్ల అండర్ పాస్‌లు నిర్మిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే కామారెడ్డి పట్టణంలో మాత్రం ఒక్కటి కూడా నిర్మించకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అండర్‌పాస్‌లు, బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కామారెడ్డి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్

పకడ్బందీగా యూరియా పంపిణీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

- ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో రేషన్ కార్డుల పంపిణీ
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: జిల్లాలో యూరియా పంపిణీ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటిపారుదల శాఖ పనులు, రాష్ట్రంలో వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రేషన్ కార్డుల పంపిణీ, ఎరువుల పంపిణీ, సీజనల్ వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు.

వీసీ అనంతరం కలెక్టర్ సంగ్వాన్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఎరువుల డీలర్ల పూర్తి వివరాలు సేకరించాలని అధికారులకు సూచించారు. రేషన్ కార్డుల పంపిణీకి మండలాల వారీగా కార్యక్రమాలు ఏర్పాటు చేసి స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కార్డుల పంపిణీ చేపట్టాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు కాకుండా వ్యవసాయేతర అవసరాలకు యూరియాను వినియోగిస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

యూరియా పంపిణీ పకడ్బందీగా జరిగేలా మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్‌లు విక్టర్, చందర్ నాయక్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వర్షాల కోసం రామేశ్వర ఆలయంలో..



వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ పిట్లం మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయంలో గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో స్వామివారికి జలాభిషేకం చేశారు. గ్రామపెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.
– పిట్లం(జుక్కల్)

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం



పార్టీ నాయకులు, కార్యకర్తలతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు

నిజాంసాగర్(జుక్కల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు అన్నారు. పార్టీ అధిష్టానం టికెట్టు ఎవ్వరికి ఇచ్చినా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కష్టపడి గెలిపించుకోవాలని ఆయన సూచించారు. మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నరాజులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. దేశ ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. బీజేపీ నాయకులు శ్రీకాంత్, కొండ అనిల్‌గుప్తా, లింగాల శంకర్‌పటేల్, రౌతు రాజు, యాదయ్య, విఠల్, సాతెల్లి శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

కళాశాలల్లో సీసీ కెమెరాలు



- తరగతి గదులు, ప్రయోగశాలలు, వరండాలలో..
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిరంతర పర్యవేక్షణ
- జిల్లాలోని 20 కాలేజీల్లో బిగింపు
- విద్యార్థుల హాజరు, ఫలితాలు మెరుగుపడే అవకాశం
- కంట్రోల్ కమాండ్ సిస్టం ద్వారా ఇంటర్‌బోర్డు అధికారుల పర్యవేక్షణ

కామారెడ్డి టౌన్: పబ్లిక్ పరీక్షల నిర్వహణ సమయంలోనే ప్రభుత్వ కళాశాలల్లో సీసీ కెమెరాల కనిపిస్తాయి. కానీ ఇక నుంచి ప్రభుత్వ కళాశాలల్లో రోజువారీ తరగతులు, కార్యకలాపాలను సీసీ కెమెరాలతో సంబంధిత అధికారులు పర్యవేక్షించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రభుత్వ కళాశాలల్లోని తరగతి గదులు, ప్రయోగశాలలు, వరండాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండనున్నాయి. ఇప్పటికే జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాలను అమర్చారు. విద్యార్థుల హాజరుశాతం తగ్గుతుండడంతో పరీక్షల్లో ఆశించిన ఫలితాలు కూడా రావడం లేదని, సీసీ కెమెరాలను అమర్చితే విద్యార్థుల హాజరు శాతం పెరగడంతోపాటు విద్యాబోధన సైతం మెరుగుపడి ఫలితాలు మెరుగుపడే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఒక్కో కళాశాలలో 13..

జిల్లాలో మొత్తం 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. గతేడాది 5,543 మంది విద్యార్థులు విద్యనభ్యసించగా, ఈ విద్యా సంవత్సరం మొదటి సంవత్సంలో ఇప్పటి వరకు 3,200 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. 2,600మంది సెకండియర్ విద్యార్థులున్నారు. వొకేషనల్‌లో మరో 500 మందికి పైగా విద్యార్థులున్నారు. ప్రతి కళాశాల లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులున్నాయి. ఒక్కో కళాశాలకు 13 చొప్పున సీసీ కెమెరాలను ఇంటర్ బోర్డు అధికారులు అందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని కళాశాలల్లో కెమెరాల ఏర్పాటుకు సంబంధించిన పనులను టెక్నీషియన్లు చేపట్టారు.

రోజువారీగా హాజరు విద్యార్థులు, బోధన తీరు, లెక్చరర్ల హాజరు వారి విధులు, కళాశాల నిర్వహణ తదితర అంశాలపై కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా బోర్డు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారు. అలాగే జిల్లా అధికారులు సైతం పర్యవేక్షించనున్నారు.

“ నిరంతర పర్యవేక్షణ ఉంటుంది

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. ఇక విద్యార్థుల హాజరు, బోధన తీరు, లెక్చరర్ల విధులు, ఇలా అన్ని అంశాలపై నిఘాతో పర్యవేక్షణ ఉంటుంది. ఇంటర్ బోర్డు అధికారులు కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా పర్యవేక్షించనున్నారు. విద్యార్థుల హాజరు, ఫలితాలు కూడా మెరుగుపడుతాయి.



– షేక్ సలాం,
ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి, కామారెడ్డి

సాటిలేని మహాకవి దాశరథి

- సామాజిక న్యాయం కోసం కవులు పోరాడాలి
- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల

నిజామాబాద్ రూరల్ : 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న దాశరథి మాట జిల్లా జైలు గోడలు దాటి బయటి ప్రపంచాన్ని చైతన్యపరిచి విశ్వవ్యాప్తమైందని, ఆయన సాటిలేని మహాకవి అని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల అన్నారు. నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన దాశరథి శతజయంత్యుత్సవాలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తొలి దశ తెలంగాణ ఉద్యమంలో మహాకవి దాశరథి నిజాం నిరంకుశానికి ఎదురొడి పోరాటం చేశారన్నారు. తాళం, గానంతో ప్రజల గుండెలను చైతన్యపరిచే వాడే నిజమైన కవి అని అన్నారు. కవులు ఎప్పుడూ ప్రజల కన్నీళ్లు తుడిచేలా ఉండాలన్నారు. తెలంగాణ యుద్ధనౌక, తన తండ్రి అయిన గద్దర్‌కు ఇచ్చిన మాట కోసం తాను సమసమాజ స్థాపన, ఓటు హక్కు విప్లవం కోసం అంతర్గతంగా పోరాడతానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కవులు, కళాకారులకు పేరు, ప్రతిష్టలు వచ్చాయన్నారు. అనంతరం తెలంగాణ మలి దశ ఉద్యమంలో పని చేసిన వారికి ఉద్యోగాలు ఇప్పించాలని కళాకారులు చైర్‌పర్సన్ వెన్నెలకు వినతిపత్రం అందజేశారు. వెన్నెలను డాక్టర్ కవితారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత సన్మానించారు. చివరగా వెన్నెల పాడిన విప్లవ గీతం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీఈవో అశోక్, ప్రొఫెసర్ కనకయ్య, హెచ్ఎం సీతయ్య, కమిటీ సభ్యులు సిర్ప లింగం, కోనేరు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల


మధ్యాహ్న భోజనం అందేనా?

- జూనియర్ కళాశాలల్లో అమలుకాని పథకం
- అమలైతే హాజరుశాతం పెరిగే అవకాశం

దోమకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో తరహా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెడతామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. మధ్యాహ్న భోజనం అమలైతే గ్రామీణప్రాంతాల నుంచి పట్టణాల్లోని జూనియర్ కళాశాలలకు వచ్చే విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పేద కుటుంబాల వారే అధికం

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే వారిలో అనేక మంది పేద కుటుంబాలకు చెందిన వారే. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు కట్టలేని వారంతా ప్రభుత్వ కళాశాలల్లో చేరుతున్నారు. అయితే బాక్సులు వెంట తీసుకురాని విద్యార్థులు సాయంత్రం వరకు తరగతులు చేయకుండానే వెనుదిరుగుతున్నారు. ఇది అటెండెన్స్‌పై ప్రభావం చూపుతోంది.



నిరాశపరుస్తున్న ఫలితాలు

గత విద్యాసంవత్సరం ఇంటర్ ఫలితాలు నిరాశపరిచాయి. గడిచిన విద్యా సంవత్సరం ఫలితాల్లో కామారెడ్డి జిల్లా అట్టడుగున 35వ స్థానంలో నిలిచింది. విద్యార్థులు తరగతులకు హాజరుకాకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లేదా అల్పాహార పథకాన్ని అమలు చేయాల్సింది ప్రభుత్వమే అని ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం స్పష్టం చేశారు.

క్లుప్తంగా

చేప పిల్లల ఉత్పత్తిలో నిర్లక్ష్యం తగదు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద ఉన్న జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఫిషరీష్ సెల్ జిల్లా అధ్యక్షుడు బోర్గాం శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం జాతీయ చేపపిల్లల కేంద్రాన్ని పరిశీలించారు. చేపపిల్లల ఉత్పత్తిపై ఏడీ నిజామాబాద్ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటి వరకు 70 లక్షల స్పాన్ మాత్రమే ఉత్పత్తి చేశారన్నారు. చేప పిల్లల ఉత్పత్తి పై నిర్లక్ష్యం వీడాలన్నారు. ఆయన వెంట గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు కస్పా శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ వాసు, మత్స్యకారులు ఉన్నారు.

సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించాలి



కామారెడ్డి క్రైం: నేరాల నియంత్రణ, కేసుల పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమమని, ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించాలని ఏఎస్పీ చైతన్యరెడ్డి అన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏఎస్పీ సోమవారం ప్రారంభించారు. జీవధాన్ ఆస్పత్రి నుంచి వసుంధర వెంచర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా 25 సీసీ కెమెరాలను వసుంధర వెంచర్ వారి సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

జెండా బాలాజీ ఆలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెండా బాలాజీ ఆలయంలో సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి సభ్యులు సోమవారం జెండా జాతరకు సంబంధించిన బట్ట పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్వ సమాజ్ సభ్యులు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా వస్తున్న ఆచారం ప్రకారం జెండా బాలాజీ ఆలయంలో జెండా జాతరకు సంబంధించిన బట్టపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త!

- వాతావరణ మార్పులతో జ్వరాలు
- అప్రమత్తమైన ఆరోగ్య శాఖ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వర్షాకాలం ప్రారంభం కావడంతో రోగాల సీజన్ మొదలైంది. ఈ సీజన్‌లో వ్యాధులు దరిచేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు ఆరోగ్య శాఖాధికారులు. వానలు కురియడం మొదలు కావడంతో వాతావరణంలో మార్పుల దృష్ట్యా వైరల్ ఫీవర్స్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సరైన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి పది మందిలో నలుగురికి జలుబు, ఇద్దరి జ్వరంతో కూడిన వైరల్ ఇన్‌ఫెక్షన్‌లు వచ్చే అవకాశాలున్నాయి. వైరల్ జ్వరాలు అకస్మాత్తుగా వచ్చి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఒక్కోసారి 102 డిగ్రీల జ్వరం ఉంటుంది. తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పుల మధ్య నిస్సత్తువగా మారిపోతారు. కొందరిలో ఒంటిపై దద్దుర్లు, వాంతులు అరుదుగా విరేచనాలు కనిపిస్తాయి. మరి కొందరిలో జలుబు వంటి లక్షణాలు ఏవీ లేకుండానే జ్వరాలు వస్తాయి. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటివి వైరల్ ఫీవర్ కొందరికి వస్తాయి.

వైరల్ ఫీవర్ రావడానికి గల కారణాలు..

వైరల్ ఫీవర్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కొన్ని సార్లు శ్వాస నాళాల ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు వైరల్ ఫీవర్ వస్తుంది.



సదాశివనగర్‌లో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ప్రధానంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పకుండా పాటించాలి.

ఆరోగ్య శాఖ అప్రమత్తం..

సీజనల్ వ్యాధులు సోకకుండా మండల వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. సదాశివనగర్, ఉత్తునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మెడికల్ క్యాంపుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. శిబిరంలో రోగులను పరీక్షించి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందిస్తున్నారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

సీజనల్ వ్యాధులు సోకుండా ఉండాలంటే ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరం రాగానే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. దోమతెరలను వినియోగించాలి. పూల కుండీలు, ఎయిర్ కూలర్లు, నీటి గొట్టాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేడి పదార్థాలను తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

– దివ్య, పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారిణి, సదాశివనగర్

గడికోటలో ఆషాఢ వనభోజనాలు



దోమకొండ మండలకేంద్రంలోని గడికోటలో వనభోజనాలకు హాజరైన ఆర్య వైశ్యులు

దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో సోమవారం అభయాంజనేయ ఆర్యవైశ్య సంఘం కల్కి నగర్ కామారెడ్డి ఆధ్వర్యంలో ఆషాఢ మాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘానికి చెందిన పలు కుటుంబాలు వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. సంఘం అధ్యక్షులు ఆమేటి రమేష్ గుప్తా, కార్యదర్శి మనోజ్ గుప్తా, కోశాధికారి శ్రీధర్, అతిమామల యాదగిరి, చల్ల సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి

- నిజామాబాద్ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మోపాల్: విద్యార్థినులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి నిర్వాహకులకు సూచించారు. మోపాల్ మండలంలోని కంజర్ శివారులో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ కళాశాలను కలెక్టర్ సోమ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. విద్యార్థినుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. స్టోర్ రూంలో నిల్వ ఉన్న బియ్యం, పప్పు, వంట నూనె ఇతర వంట సామాగ్రిని పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య స్థి తిగతులు, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి ఆ రా తీశారు. అల్పాహారం, భోజనం రుచికరంగా ఉంటుందా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న నిజామాబాద్ కలెక్టర్

‘రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యం’

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యం కావాలని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర ప్రతినిధి మంగళిపల్లి శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం రామారెడ్డిలోని గంగపుత్ర సంఘ భవనంలో మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో బీసీలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు.

మంగళిపల్లి శంకర్ మాట్లాడుతూ.. బీసీలంతా ఏకతాటిపై వచ్చి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా బీసీలను మోసం చేసి అగ్రవర్ణాలను అందలం ఎక్కిస్తున్నాయని మండిపడ్డారు. వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నేతలు సిరివెరు శంకర్, పూస రవి, దువ్వల శ్రీకాంత్, పిప్పరి లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

జాతీయ ఓబీసీ మహాసభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జాతీయ ఓబీసీ మహాసభల వాల్ పోస్టర్లను సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శివరాములు మాట్లాడుతూ.. ఆగష్టు 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుంచి 10 వేల మంది ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్నారన్నారని తెలిపారు. ఈ మహాసభకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున బీసీలు కదిలి రావాలని పిలుపునిచ్చారు. నేతలు నాగరాజు, భూమన్న, మోహనాచారి, నాగోజీ నారాయణరావు, హాజీ అబ్దుల్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



తాడ్వాయిలో మాట్లాడుతున్న యూత్ మండల అధ్యక్షుడు అఖిల్‌రావు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు అఖిల్‌రావు అన్నారు. తాడ్వాయి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం యూత్ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అర్థమయ్యే పద్ధతిలో తెలిపాలని, అర్హులైన వారందరికి పథకాలు అందేలా చూడాలన్నారు. పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు సతీష్, రంజిత్, దయాకర్, ప్రవీణ్, మహిపాల్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఎల్లమ్మకు బోనాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గౌడ కులస్తులు సోమవారం ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో బోనాలను ఊరేగించారు. మొక్కులు తీర్చుకొని వర్షాలు బాగా కురవాలని, పిల్లాపాపలను చల్లగా చూడాలని, పాడిపంటలు సంవృద్ధిగా పండాలని అమ్మవారిని కొలిచారు.

శివాలయంలో అన్నదానం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని పాపహరేశ్వర ఆలయంలోని శివుడికి సోమవారం రైతులు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని వేడుకున్నారు.అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెన్సిల్ లెడ్‌పై బోనం ఎత్తుకున్న మహిళ చిత్రం



మోహన్



బాన్సువాడ రూరల్: సోమేశ్వర్ గ్రామానికి చెందిన మైక్రో ఆర్టిస్టు మోహన్ తన కళానైపుణ్యంతో పెన్సిల్‌లెడ్‌పై బోనం ఎత్తుకున్న మహిళ చిత్రాన్ని గీచి అబ్బురపర్చాడు. తెలంగాణలో ప్రస్తుతం బోనాల సందడి నెలకొనడంతో చిత్రాన్ని చెక్కినట్లు మోహన్ తెలిపారు. గతంలోనూ అనేక చిత్రాలను పెన్సిల్ గ్రాఫైట్‌పై గీచిన మోహన్ సూక్ష్మకళను పలువురు ప్రశంసించారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ



కామారెడ్డి అర్బన్: పీపుల్ ఫర్ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని గర్గుల్‌లో రోటరీ క్లబ్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ ఎస్వీ రాంప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ ఎం.జైపాల్‌రెడ్డిలు ఇద్దరు ది వ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రో టరీ క్లబ్ ప్రతినిధులు శంకర్, కృష్ణహరి, రమ ణ,రాజనర్సింహారెడ్డి,శ్రీశైలం,నాగభూషణం, కాశీనాథం,దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం కాంగ్రెస్ నేతలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కిష్టయ్య మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 12 మందికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకారంతో సీఎం సహాయనిధి నుంచి రూ.3 లక్షల 4 వేల 500 మంజూరయ్యాయన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి



భిక్కనూరు: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాజవేణి రాజేందర్(53) సోమవారం వేకువజామున మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాజేందర్‌ను కుటుంబీకులు మొదట కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సాయంత్రం భిక్కనూరులో అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడి అదృశ్యం



నవీపేట: మండలంలోని పొల్ద గ్రామానికి చెందిన చిన్నోళ్ల గణేశ్(35) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గణేశ్ బతుకుదెరువు నిమిత్తం దుబాయికి వెళ్లగా గత నెలలో అతని తండ్రి మృతి చెందడంతో స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 4న తాను గల్ఫ్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. 15 రోజుల నుంచి ఎలాంటి ఫోన్ లేకపోవడంతో భార్య స్రవంతి జిల్లా కేంద్రంలోని ట్రావెల్స్ యజమానులను సంప్రదించింది. వారు సౌదీకి వెళ్లలేదని తెలుపడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ

లింగంపేట: మండలంలోని పోతాయిపల్లి శివారులో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దమ్మతల్లి మెడల ఉన్న మూడు బంగారు పుస్తెలు, హుండీలోని నగదును దుండగులు అపహరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వే బిల్లు లేని సరుకు రవాణా ట్రక్కు పట్టివేత



డిచ్‌పల్లి: వే బిల్లు లేకుండా సరుకు రవాణా చేస్తున్న ట్రక్కును నిజామాబాద్ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకుని డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. ఏసీటీవో కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు కామారెడ్డి నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ట్రక్కును డిచ్‌పల్లి మండలం బీబీపూర్ శివారు జాతీయ రహదారిపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మూడు రోజుల క్రితం పట్టుకున్నారు. డ్రైవర్ వద్ద వే బిల్లు లేకపోవడంతో ట్రక్కుతో పాటు అతడిని డిచ్‌పల్లి పీఎస్‌కు తీసుకెళ్లి వారి కస్టడీలో ఉంచారు. సోమవారం వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు డిచ్‌పల్లి పీఎస్‌లో తమ సిబ్బందితో చేరుకున్న ఏసీటీవో ట్రక్కు సీల్‌ను తెరిచి అందులో రవాణా చేస్తున్న సరుకును తనిఖీ చేయగా రాజ్ నివాస్ పాన్ మసాల ప్యాకెట్లు బయటపడ్డాయి. సుమారు 200 బస్తాల్లో ఉన్న పాన్ మసాల ప్యాకెట్ల విలువను లెక్కించి వాటికి ఎంత మేరకు జీఎస్టీ అవుతుందో నిర్ధారిస్తామన్నారు. అనంతరం జీఎస్టీ ఎగవేయడానికి వే బిల్లు లేకుండా సరుకు అక్రమ రవాణా చేస్తున్నందున జరిమానాగా సుమారు 200 శాతం జీఎస్టీ వసూలు చేస్తామని తెలిపారు. డబ్బులు చెల్లించేంత వరకు సరుకుతో పాటు ట్రక్కు డిచ్‌పల్లి పోలీసుల కస్టడీలోనే ఉంటుందన్నారు. డ్రైవర్‌ను ప్రశ్నించగా మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్నట్లు చెప్పాడని ఏసీటీవో పేర్కొన్నాడు. అయితే ఇండోర్ నుంచి నాగ్‌పూర్ మీదుగా నేరుగా ఆదిలాబాద్‌కు చేరుకునే అవకాశం ఉండగా హైదరాబాద్ మీదుగా ట్రక్కును ఆదిలాబాద్ కు తరలించడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అప్పుల బాధతో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య



రమేశ్‌కుమార్ (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని వెస్లీనగర్ తండాకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ రాథోడ్ రమేశ్ కుమార్ (46) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ ఆర్టీసీ డిపో-1లో రమేశ్‌కుమార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడికి భార్య సరోజ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆదివారం సరోజ తీజ్ పండుగ కోసం తల్లిగారి ఊరు యాచారం తండాకు వెళ్లింది. రాత్రి భోజనం చేసిన తర్వాత రమేశ్ బెడ్ రూం కు వెళ్లి నిద్రపోయాడు. సోమవారం ఉదయం 8 గంటలైనా కొడుకు బయటకు రాకపోవడంతో తల్లి కమల వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు తండాకు చేరుకుని వివరాలు సేకరించారు. తన ఇద్దరు పిల్లలకు పెళ్లిళ్లు చేయడం, పొలంలో నీళ్ల కోసం ఐదు బోర్లు వేయగా అవి ఫెయిల్ కావడంతో సుమారు రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పుల బాధతో మనస్తాపానికి గురైన రమేశ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..

కామారెడ్డి క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు దేవునిపల్లి ఎస్సై రంజిత్ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాజంపేటకు చెందిన గొడుగు సుధాకర్(30) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. వ్యవసాయం, కుటుంబ అవసరాలకు కొంత కాలంగా చేసిన అప్పులు పెరిగాయి. దీంతో మనస్థాపంతో ఆదివారం సాయంత్రం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మొరం టిప్పర్ల పట్టివేత

డిచ్‌పల్లి: అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులోని సీఎంసీ మెడికల్ కాలేజ్ సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అనంతరం టిప్పర్లను డిచ్‌పల్లి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అధికార పార్టీకి చెందిన వాహనాల యజమాని టిప్పర్లను విడిపించుకునేందుకు జిల్లా స్థాయి నాయకులతో పైరవీలు చేసినా ఫలితం లేకుండా పోయిందని సమాచారం. స్థానిక పోలీసులకు బదులు పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు టిప్పర్లను పట్టుకోవడంతో వాటిని విడిపించుకోలేక పోయినట్లు తెలుస్తోంది.



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న మొరం టిప్పర్లు

దారిదోపిడీకి పాల్పడిన నిందితుల అరెస్ట్

కామారెడ్డి క్రైం: బైక్‌పై ఇంటికి వెళ్తున్న ఓ వక్తిని లిఫ్ట్ అడిగి దారి దోపిడీకి పాల్పడిన కేసులో నిందితులను పోలీసులు సోమవారం పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి ఏఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. దోమకొండ మండలం చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన సార్ల చిన్న గంగయ్య శుక్రవారం సాయంత్రం వ్యక్తిగత పనులపై కామారెడ్డికి వచ్చాడు. ఓ కల్లు దుకాణంలో కల్లు సేవించిన సమయంలో అక్కడే ఉన్న ఓ మహిళ అతనితో మాటలు కలిపి చింతమాన్‌పల్లి వెళ్లే దారిలో క్యాసంపల్లి వరకు తనకు లిఫ్ట్ ఇవ్వమని అడిగింది. చిన్న గంగయ్య సరేనని ఆమెను బైక్‌పై ఎక్కించుకుని పట్టణ శివారు దాటగానే ఓ చోట బైక్ ఆపమని అడిగింది. వెంటనే ఇద్దరు వ్యక్తులు అక్కడకు వచ్చి గంగయ్యను బెదిరించి అతని వద్ద ఉన్న రూ.28 వేలు లాక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాలతో నిందితులను పట్టణంలోని షబ్బీర్ అలీ కాలనీలో నివాసం ఉండే కడమంచి లక్ష్మి, షేక్ జావేద్, షేక్ అబ్బు లుగా గుర్తించారు. సోమవారం వారిని ఓ కాలనీ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఏఎస్పీ తెలిపారు. నిందితులు గతంలోనూ మేడ్చల్, దేవునిపల్లి, తదితర పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఇలాంటి దారి దోపిడీ ఘటనలకు పాల్పడినట్లు పలు కేసులు ఉన్నాయని వెల్లడించారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని అన్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు ఉస్మాన్, వినయ్ సాగర్, సిబ్బంది రాజేందర్, గణపతి, నరేశ్, రాజు, భాస్కర్, కిషన్, శ్రావణ్, కమలాకర్ మైసయ్య లను ఏఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

సైబర్ మోసం.. రూ. 1.35 లక్షలు పోగొట్టుకున్న మహిళ

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధిలోని కుమార్‌గల్లీకి చెందిన ఓ మహిళ సైబర్ మోసానికి గురై రూ. రూ. 1.35 లక్షలు పోగొట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. మహిళ తన ఫోన్ చూస్తుండగా ఓ మెసేజ్ వచ్చింది. అందులో తాము సూచించిన హోటల్స్‌కు రేటింగ్ ఇస్తే ప్రతి నెల జీతం ఇస్తామంటు సదరు మహిళను నమ్మబలికారు. ఇది నమ్మిన ఆమె వారు మహిళ వాట్సాప్‌కు ఓ లింక్‌ను పంపారు. మహిళ లింక్ ఓపెన్ చేయడంతో ఆమె బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ. 1.35 లక్షల నగదును సైబర్ మోసగాళ్లు అపహరించారు. మోసాన్ని గుర్తించిన మహిళ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఓటీపీలు పంపితే చెప్పొద్దని, ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు.

పర్మళ్లలో..

లింగంపేట: మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన మరిపల్లి సాయాగౌడ్ సైబర్ మోసానికి గురై రూ. 30వేల500 పోగొట్టుకున్నట్లు ఎస్సై దీపక్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయాగౌడ్‌కు ఫేస్‌బుక్‌లో ఇటీవల ముద్ర లోన్ యాడ్‌రావడంతో పాటు ఒక ఫోన్ నంబర్ వచ్చింది. దీంతో బాధితుడు దానిని ఓపెన్ చేయగా అందులో రూ. 15 లక్షల లోన్ అప్రూవల్ అని వచ్చింది. లోన్ కావాలంటే ముందుగా కొంత డబ్బు కట్టాలంటు సైబర్ మోసగాళ్లు సాయాగౌడ్‌కు సూచించారు. విడదల వారిగా ఆయన రూ. 30,500 నగదును ఆన్‌లైన్‌లో వారికి పంపించాడు. చివరగా మరో రూ. 49వేలు పంపాలంటు చెప్పడంతో అనుమానం వచ్చి కార్యాలయ అడ్రస్ చెప్పాలని బాధితుడు కోరాడు. వారు ఫేక్ అడ్రస్ చెప్పి ఫోన్ సేవలను నిలిపివేశారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

పెద్దకొడప్‌గల్: మండలంలోని శివాపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శివాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి సోమవారం మధ్యాహ్నం దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 11వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే వారిపై చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.